# అంతర్లోచనం

విప్పగుంట రామ మనోహర

# అంతర్లోచనం

నాతో
నా వెంటే
నా ఒంటరి తనంలో భాగంగా
రాత్రంతా intangible గా కురిసి
పొద్దున్నే crystalise అయిన మంచులా
అంతలోనే రూపు మార్చి
ఊహలా ఎర్రగా ఆశలా కాలుతూ
అంటుకున్న అడవిలా
లావా మింగిన ఆరావళిలా
రూపు ఊహించలేని విధంగా
చెంగున ఎగిరి
పొదల్లో దూరిన బంగారు లేడిలా
నా అవిభాజ్య అంగంగా
నాళాల్లో రక్తంలా
అద్దంలో నా ముఖంలా
తెలిసి తెలుస్తూ
జారుకున్న బోనులో నా ఎదుట పులిలా
పులి... నేను... ఎదురెదురు
పులిలోనేనులోపులి
ఒకరి నొకరు నములుతూ
అనుక్షణం చైతన్యం
కాలం ఆగిపోయినట్లు
మొగ్గ విచ్చుకుంటున్నట్లు
అదొక ఆవిష్కరణ

అలుపెరుగని నిరంతర process... evolution
మస్తిష్కపు కెటిల్‌లో
మరిగే చా డికాక్షన్‌లా
ఉబుకుతున్న గీజర్‌లా
సృష్టిగా రూపు కట్టి
ఉద్యమంలా విస్తరించి
నాలో లేని నన్ను వెలికి తీస్తూ
నాకు తెలీని నా గుండె కోణాలను వీడియో తీస్తూ
పసినవ్వు మార్మికతలా నన్ను సవాల్ చేస్తూ
జీవితాన్ని obsession చేస్తూ
నా పాంచ భౌతికానికి జ్ఞాపకమై వ్యాపకమై రచనై పరిమళాలు అద్ది
నా ఉనికిని ముద్రిస్తూ
నన్ను మించి జీవిస్తుంది
గీతలోని ఆత్మ లాగా
మరో ట్రైన్ కోసం... నా లాంటి నా కోసం
ఎదురు చూసే ప్లాట్ ఫారం అవుతుంది
మీడియం అవుతుంది
నిత్యం నిరంతరం
సంచలనం
లోతైన లోచనం
ఆలోచలనం
ఆలోచన...
ఒక frequency...
resonance లో ప్రపంచం !!!

***

**ఆదివారం వార్త *27.02.2005***

***"కవితా వార్షిక-2005"***

# స్వప్న సంవాదం

కళ్ళ మీద మొలిచిన
లేత స్వప్నాన్ని
గాఢనిద్రలోనే చేతుల్లోకి తీసుకుని హత్తుకున్నా
ఇన్నాళ్ళూ స్వప్న స్రావాల్ని
కళ్ళ కాల్వల్లో మౌనంగా భరించి భరించి
తడియారిన నయనాలు
కలని పొదువుకునే
తాబేటి చిప్పల్ని చూసి
నిశ్చింతగా రెప్పలు వాల్చాయి

ఇప్పుడిక ఈ మట్టి ముద్దకు
రూపు దిద్దాలని అనుకుంటూ
మూసిన నా చేతుల్లో
అప్రమేయంగా
రెక్కలు విచ్చుకున్న చిరు తాకిడి
శ్వాసించిన చిరు దీపపు వెచ్చదనం
"నీ చేతుల్లో ఒదగ లేను
నా బరువు నువ్వు మోయలేవు
నీవు నన్ను ఊహిస్తే చాలు
ఇంత ఊపిరిస్తే చాలు
నన్ను నేను రూపిస్తా